మహిళలకు 'మహా'వరం

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం
- సత్తుపల్లి డిపో పరిధిలో 7 లక్షల మందికి లబ్ధి
- రోజువారీ మహిళా ప్రయాణికులు 9వేల మంది
- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీలు
- రాష్ట్ర సరిహద్దు వరకు ప్రయాణం


సత్తుపల్లిలో ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏసీపీ రామానుజం


మధిర: జెండా ఊపి బస్ సర్వీసు ప్రారంభిస్తున్న సీఐ, డీఎం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడురోజుల్లోనే పథకాన్ని అమలు చేసేందుకు రూపకల్పన చేసింది. దీనిలో భాగంగా శనివారం నుంచి మహిళల ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టి ప్రారంభించింది.

మధిర: మధిర బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని శనివారం టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ డి.దేవదానం, మధిర సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జాటోత్ వసంత్ కుమార్ పచ్చజెండా ఊపి లంఛనంగా ప్రారంభించారు. అనంతరం బస్సులో ఎక్కిన వారికి డిపో మేనేజర్ చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మధిర, కల్లూరు, ఎర్రుపాలెం తదితర ప్రాంతాలకు ఆంధ్ర సరిహద్దులో ఉందని.. అయితే తెలంగాణ సరిహద్దు వరకు టికెట్ లేకుండా ప్రయాణించి, ఆంధ్రలోకి ప్రవేశించేటప్పుడు టికెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వారం రోజులు పాటు గుర్తింపు కార్డులు లేనప్పటికీ ఉచిత ప్రయాణం చేయవచ్చని.. ఆ తర్వాత ఆధార్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు కానీ, ఏదైనా గుర్తింపు కార్డును కండెక్టర్‌కు చూపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని సోనియాగాంధీ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మధిర టౌన్ ఎస్ఐ రాజేష్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: మహాలక్ష్మి పథకం బస్సులను సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి.. శనివారం కల్లూరు ఏసీపీ రామానుజంతో కలిసి ప్రారంభించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మహిళలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని 96 ఆర్టీసీ బస్సులు ఉన్నాయని వాటిలో 38 పల్లెవెలుగు, 40 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయన్నారు. నిత్యం డిపో పరిధిలో సుమారు 9వేల మంది మహిళా ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణీస్తున్నారు. వీరందరికి మహాలక్ష్మి పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజన్ విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ,


తల్లాడ: ఆర్టీసీ బస్టాండ్‌లో..

మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, సీఐ మోహన్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, గాదె చెన్నారావు, రామిశెట్టి సుబ్బారావు, ప్రభాకర్ రావు, ఎం.సాంబ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, తల్లాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు పాట్టేటి జనార్ధన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, వేమిశెట్టి జగదీష్, వెంకటేశ్వర రావు, రామలక్ష్మణ్, షేక్ జమాల్ పాల్గొన్నారు.


వైరాలో బస్సు ఎక్కుతున్న మహిళలు

సంతోషంగా ఉంది..

మా కుమార్తె మధిరలో ఉంటుంది. గతంలో ఇల్లెందు నుంచి నేను మధిరకి రావాలంటే బస్సు చార్జీలు భారంగా ఉండేది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించడం సంతోషంగా ఉంది.
– కళావతి, ఇల్లెందు

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. దీంతో టికెట్ లేకుండా మధిర నుంచి వైరా వెళ్తున్న.
– రహమాన్ బీ, అల్లీనగరం

మంచి నిర్ణయం..

బస్సు ఎక్కగానే చార్జీలు లేవని.. ఎక్కడివరకైనా ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పడంతో నాకు చాలా సంతోషం వేసింది. ప్రభుత్వం మహిళల కోసం మంచి నిర్ణయం తీసుకుంది.
– ఎస్‌కె గెహనా, సత్తుపల్లి

సీఎం రేవంత్ అన్నకు ధన్యవాదాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడోరోజే ఇచ్చిన హామీ అమలు చేయటం సంతోషం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినందుకు సీఎం రేవంత్ అన్నకు ధన్యవాదాలు.
– డి.శ్రావణి, మర్లపాడు

ఆనందంగా ఉంది..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడం ఆనందంగా ఉంది. ఆరు గ్యారంటీలు కూడా అమలు చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందాలి. సంక్షేమంపై దృష్టి పెట్టాలి.
– మామిడాల విజయ, వైరా

కొత్తగా ఉంది.

ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించడం కొత్తగా ఉంది. ఈ పథకం నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పది కాలాల పాటు ప్రభుత్వం కొనసాగాలి.
– కె.వెంకటనరసమ్మ, తాటిపూడి

మహాలక్ష్మి పథకం మంచిది..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో మహిళల కోసం ప్రకటించిన మహాలక్ష్మి పథకం బాగుంది. అన్ని బస్సులలో కూడా ఉచిత అవకాశం కలిపిస్తే మరింత సౌకర్యంగా ఉంటుంది.
– కె.పార్వతి, వైరా

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

సత్తుపల్లిలో డిగ్రీ చదువుతున్నా. నెలకు బస్‌పాస్‌లకు రూ.500 చెల్లించి ప్రయాణం చేస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సదుపాయంతో ఉచితంగా బస్సుల్లో వచ్చి చదువుకునే అవకాశం లభిస్తుంది. ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– కె.శ్రావణి, టేకులపల్లి

క్లుప్తంగా

మహిళా ప్రయాణికులకు శుభాకాంక్షలు


మహిళా ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పెనుబల్లి: వీయంబంజర్ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులకు పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పూష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈడా కమలాకర్, మేకతొట్టి కాంతయ్య, వంగా వెంకటేశ్వరరావు, గోగినేని రమేష్, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, కానిస్టేబుల్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వైరా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని వైరాలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలు సంబురాలు జరుపుకుని మిఠాయిలు పంపిణీ చేశారు. టీపీసీసీ కార్యదర్శి కట్లరంగారావు ఆధ్వర్యంలో బస్సుల్లో ప్రయాణించే మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు 100 రోజులలో అమలు చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, నాగరాజు, నాగేశ్వర రావు, రంగారావు, డాక్టర్ హరిత, మదన్మోహన్, వీరబాబు, సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్సులో ఎమ్మెల్యే రాగమయి పర్యటన

సత్తుపల్లి: ఇటీవల సత్తుపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ మట్టా రాగమయి తన తొలి పర్యటనను ఆదివారం ఆర్టీసీ బస్సులో చేస్తారని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటలకు సత్తుపల్లి నుంచి కల్లూరు వరకు బస్సులో వెళ్లి కప్పలబంధం రోడ్డు, పుల్లయ్య బంజర్ రోడ్డులోని శివాలయం వద్ద తుపాన్ తాకిడికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఆతర్వాత కృష్ణఫ్రూట్ మార్కెట్‌లో ఎంపీఏ ఆధ్వర్యాన నిర్వహించే అవగాహన సదస్సు, 11.30 గంటలకు తల్లాడ మండలం మల్లారంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి, 12.30 గంటలకు సత్తుపల్లిలోని సరస్వతి గుడి వద్ద జరిగే వనసమారాధనలో పాల్గొంటారని దయానంద్ వెల్లడించారు.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఎర్రుపాలెం: ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలివ్వాలని ఉద్యమకారుడు, అప్పటి జేఏసీ మండల కమిటీ చైర్మన్ కర్నాటి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణా రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులందకీ 250 చ.గజాల ఇళ్ల స్థలాలను ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను చులకనగా చూసి ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ సతీష్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సొసైటీ సీఈఓ సతీష్ ప్రారంభించారు. ఏ–గ్రేడ్ రకం ధాన్యాన్ని రూ.2,203, బి–గ్రేడ్ రకం ధాన్యాన్ని రూ.2,181 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది విజయ్, రైతులు పాల్గొన్నారు.

'టాలెంట్' విద్యార్థుల పిక్నిక్

సత్తుపల్లిరూరల్: మండలంలోని చెరుకుపల్లి గిన్నెలతోగు వద్ద శనివారం పట్టణంలోని టాలెంట్ పాఠశాల విద్యార్థులకు పిక్నిక్ నిర్వహించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీదుర్గామల్లేశ్వరస్వామికి అన్నాభిషేకం


శివాలయంలో స్వామివారికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు, భక్తులు స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి అర్చకులు కాశావజుల నరసింహమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. పలువురు పుణ్య దంపతులు కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాలను పంపిణీ చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ద్వారకతిరుమలకు పాదయాత్ర

సత్తుపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు తుమ్మల నాగేశ్వరరావు, మట్టా రాగమయి విజయం సాధించిన సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నర్సింహారావు ఆధ్వర్యంలో నాయకులు శనివారం ద్వారకతిరుమల(చిన్న తిరుపతి)కు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రంగారావు, ఉమా, కృష్ణ, ఐ.శ్రీను, విష్ణువర్ధన్‌రావు, లక్ష్మణ్‌రావు, కార్తీక్, కిట్టు, గాంధీ, జగన్మోహన్‌రావు, రవి, శ్రీను, మునీర్, పవన్, హనుమంతు, రాజు, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.


పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న తుమ్మల యుగంధర్

మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


పొంగులేటికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రి వర్గంలో చోటు దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లాకు ఒక మంత్రిగా సేవచేసే భాగ్యం లభించిందని తప్పకుండా అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, పెద్దబోయిన శ్రీను, ఎస్‌కే తురాబల్లి, పాపబత్తిని నగేష్ తదితరులు పాల్గొన్నారు.


వైరాలో నగర సంకీర్తన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవం

వైరా: వైరాలోని హరి హర సుత అయ్యప్పస్వామి దేవాలయ 28వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అయ్యప్పస్వామి మాలధారులు అరట్టు ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన పూజారి తీర్థం రామకృష్ణ శర్మ నేతృత్వంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని వైరా రిజర్వాయర్ వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ అరట్టు ఉత్సవం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి దేవాలయంలో గుడిపూజ, పడిపూజ నిర్వహించి, అయ్యప్ప మాలధారులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొప్పురావూరి వెంకటకృష్ణ, వైస్ చైర్మన్ యండ్రపూడి శంకర్, మోత్కూరి శ్రీనివాసరావు, పలువురు అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు పూజల్లో పాల్గొన్నారు.


ఉత్సవంలో భాగంగా స్వామివారి పల్లకీ మోస్తున్న మాలధారులు

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో భారీ ప్రదర్శన నిర్వహించి సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి.. సోనియమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి, పార్టీకి సోనియాగాంధీ అందించిన సేవలను ప్రశంసించారు. పలుచోట్ల అన్నదానాలు, రక్తదానాలు చేయడంతో పాటు ఆస్పత్రులు, అనాథాశ్రమాలలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
– సాక్షి నెట్‌వర్క్


వైరారూరల్: తాటిపూడిలో.. కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


చింతకాని: సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


బోనకల్‌లో..


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో..


వేంసూరులో..


ఏన్కూరులో..


కారేపల్లి: కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబురాలు



చింతకాని: లచ్చగూడెంలో..

స్వామియే శరణం అయ్యప్పా..

- 41రోజులు నిష్టతో పూజలు
- మండలంలో 20ఏళ్ల నుంచి అయ్యప్ప మాలధారణ
- భక్తి పరవశంతో మండల దీక్ష పూజలు
- ప్రతీ సంవత్సరం పెరుగుతున్న స్వాములు

ముదిగొండ: ముదిగొండ మండలం నుంచి భారీ సంఖ్యలో ప్రతి ఏటా అయ్యప్ప మాలలు వేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. అయ్యప్ప భక్తులు ప్రతి ఏటా నవంబర్ నెలలో అధిక సంఖ్యలో దీక్ష చేపడతారు. వేకువజామున చన్నీళ్ల స్నానమాచరించి అయ్యప్ప అలంకారణతో పూజలు చేస్తుంటారు. 41రోజులు ఎంతో పవిత్రంగా అయ్యప్పకు పూజలు నిర్వహించి మారుమూల గ్రామాల నుంచి కేరళ రాష్ట్రం కొట్టాయం వరకు వెళ్లి శబరిమలైలోని అయ్యప్పస్వామిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకోని ఎంతో పరవశిస్తారు. అయ్యప్ప సన్నిదానంలో ఇరుముడులు అప్పగించి ముక్తి పొందుతారు.


కమలాపురంలో అయ్యప్పపడి పూజలో గురుస్వామి రాధాకృష్ణనాయర్

కేరళ నుంచి వచ్చి..

ముదిగొండ మండలంలోని ప్రతి గ్రామంలో అయ్యప్పమాలాధారులు ఎంతో పవిత్రతతో పూజలు నిర్వహిస్తుంటారు. పడిపూజలకు నన్ను గత 25ఏళ్ల నుంచి పిలిచి పూజలు చేయించుకుంటారు. ప్రతీ సంవత్సరం నవంబర్ నుంచి ముదిగొండ మండలంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పిలుస్తుంటారు.
– గురుస్వామి, రాధాకృష్ణ నాయర్

నిష్టతో పూజలు చేస్తాం..

నేను పదోసారి అయ్యప్ప మాల ధరించడం నా అదృష్టం. 41రోజులు అయ్యప్పకు పీఠం దగ్గర శరణగోస నామాలాతో భక్తి గీతాలు ఆలపించి, పూజలు చేస్తుంటాం. అయ్యప్ప దర్శనం ఎంతో అదృష్టంగా భావిస్తాం.
– సింగు వెంకటనర్సయ్య, మాలధారుడు, అయ్యగారిపల్లి

ప్రతీసారి మాల వేయాల్సిందే..

ప్రతీ సంవత్సరం మాల వేసేదాక అయ్యప్పస్వామి మదిలోనే మెదులుతాడు. కావున ఈసారి నేను 15సారి మాల ధరించాను. ఎంతో ఆరోగ్యవంతంగా, నిష్టాగరిష్టంగా పూజ చేసి పరవశిస్తుంటాం.
– లంకెల నాగభూషణంరెడ్డి, మాలధారుడు, అయ్యగారిపల్లి